



నేడే... వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం

- భవనాన్ని ప్రారంభించనున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి
- ముఖ్యఅతిథిగా ప్రముఖ పాత్రికేయులు తెలకపల్లి రవి హాజరు
- 'సమతా స్వాప్నికుడు వేమన ' పుస్తకాన్ని ఆవిష్కరించనున్న విఠపు
- ముస్తాబైన పలవలి రామకృష్ణారెడ్డి, ఎజి యతిరాజుల సభామందిరాలు
- వేమన పద్యభావ చిత్రలేఖనం ఎగ్జిబిషన్ , నృత్యరూపకం ప్రదర్శన



ప్రజాశక్తి- తిరుపతి

'భూమిలోనబుట్టు భూసారమెల్లను.... తనువులోనబుట్టు తత్వమెల్ల.... శ్రమలోనబుట్టు సర్వంబుతానౌను' అంటూ 350 ఏళ్ల క్రిందటే శ్రమ విలువను ఎంతో గొప్పగా ఆవిష్కరించి, శ్రమతత్వాన్ని చాటిన ప్రాత:స్మరణీయుడు వేమన అందించిన విజ్ఞానాన్ని నేటితరానికీ విస్తరించాలన్న ధృఢసంకల్పంతో తిరుపతి కేంద్రంగా ఏర్పాటైన 'వేమన విజ్ఞానకేంద్రం' నేడు ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. కరోనా కాలం నుంచే పలు సామాజిక, సేవా, సాంస్కృతిక, చైతన్య పూరిత కార్యక్రమాలను తిరుపతి నగరంలో నిర్వహిస్తున్న ఆ వేమన విజ్ఞాన కేంద్రం ఇకపై సకల కళలకు కేంద్రంగా భాసిల్లనుంది. తిరుపతి, యశోదనగర్‌లో ఏర్పాటైన ఈ నూతన భవనాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. దీనికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ పాత్రికేయులు, సామాజిక విశ్లేషకులు తెలకపల్లి రవి హాజరై ఈ సమాజానికి వేమన చేసిన సేవలను, చూపిన మార్గాన్ని వివరించనున్నారు. అలాగే 'సమతా స్వాప్నికుడు వేమన' పుస్తకాన్ని మాజీ ఎంఎల్‌సి, విద్యావేత్త విఠపు బాలసుబ్రమణ్యం ఆవిష్కరించనున్నారు. ప్రముఖ మార్క్సిస్టు నేత, మదనపల్లికి చెందిన న్యాయవాది పలవలి రామకష్ణారెడ్డి పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పలవలి కుసుమకుమారి ప్రారంభించనున్నారు. ప్రముఖ అభ్యుదయ అనువాద రచయిత ఏజీ యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన భార్య ఏజీ చంద్రమ్మ ప్రారంభించి తిరుపతి వాసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'వేమన పద్యభావ చిత్రలేఖనం' ఎగ్జిబిషన్‌ను అతిథులు ప్రారంభించి, వేమన నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నారు. అనంతరం నిర్వహించనున్న సభకు తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించనున్నారు.



నేడు పద్యానికి పట్టాభిషేకం ర్యాలీ..

వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 9.30 గంటలకు టిటిడి పరిపాలనా భవనం నుంచి యశోదనగర్‌లోని విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున పేర్కొన్నారు. తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఇప్పటికే వేమన పద్యాలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు పోటీలను నిర్వహించినట్లు గుర్తుచేశారు. తిరుపతిలో వేలాదిమంది విద్యార్థులు వేమన పద్యాలను కంఠస్తం చేసి నేటి సమాజ స్థితిగతులకు అన్వయం చేసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా వేలాదిమంది విద్యార్థులు 'వేమన పద్యాలను ప్రదర్శిస్తూ విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు. కవులు, రచయితలు, లలిత- జానపద కళలకు, విద్యా- వైజ్ఞానిక, శాస్త్రీయ ఆలోచనలను పెంచే కేంద్రంగా వేమన విజ్ఞానకేంద్రం నిలవబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో తిరుపతి వాసులందరూ పాల్గొనాలని నాగార్జున పిలుపునిచ్చారు.



కళ్లకలక పట్ల అప్రమత్తత అవసరం

డాక్టరు రాజ్ యశ్వంత్



ప్రజాశక్తి- తిరుపతి సిటి: సర్వేంద్రియం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మనిషికి కళ్లే కెమెరాలు. వాటి తోనే ప్రపంచాన్ని చూడగలం. సున్నితమైన ఈ అవయవాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టరు వి.రాజ్ యశ్వంత్ తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వల్ల కంటి జబ్బులు వ్యాపిస్తున్నాయని, అందులో కళ్లకలక ప్రతి ఒకరిని ఇబ్బందిలకు గురి చేస్తోందన్నారు. చిన్న, పెద్ద, ఆడా, మగా అని తేడా లేకుండా ఏ వయస్సు వారికైకనా కళ్లకలక వస్తుందన్నారు. దీన్ని అశ్రద్ధ చేయకుండా కంటి వైద్యున్ని సంప్రదించి, సరైన మందులు వాడి, కళ్లను కాపాడుకోవాలన్నారు.

కంటి జాగ్రత్తలు

కళ్లు మనిషికి చాలా ప్రధానమైనవి. అంధాకారమైన జీవితం ఊహించడానికి కూడా సాహసించరు. కళ్లను మనమే జాగ్రత్తగా కాపాడుకోవాలి.

చదివేటప్పుడు : పుస్తకం 30 సెం.మీ దూరంలో ఉంచుకోవాలి. నిటారుగా కూర్చోని చదవాలి. పడుకొని చదవకూడదు. సరిపడా వెలుతురు ఉండాలి. కదులుతున్న కుర్చీలో కుర్చోని చవితే కళ్లకు శ్రమ కలుగుతుంది.

టివి చూస్తున్నడప్పుడు : ఒక గంటకు మించి టీవి చూడడం మంచిది కాదు. టీవి చూస్తున్నప్పుడు శరీరాన్ని పలు రకాలుగా భంగిమల్లో ఉంచడం చాలా మందికి అలవాటు, అయితే వెన్నముకకి ఊతమిచ్చే కుర్చీలో కూర్చోని టీవి చూడడం కంటికి మేలు చేస్తుంది. చీకటిగా ఉన్న గదిలో కూర్చోని టీవి చూడకుడదు. టీవి చూస్తున్నప్పుడు వెలుతురు సరిపడా ఉండాలి. లైట్లు కూడా టీవి వెనకవైపు ఎత్తులో ఉంటే మంచిది.

కంప్యూటర్‌తో పని చేస్తున్నప్పుడు: కంప్యూటర్ తెర మధ్య భాగానికిక కాస్త పైన మీ చూపు ఉంటే మంచిది. రెప్ప వేయకుండా పని చేయడం మంచిది కాదు. తరుచుగా రెప్పలు వేస్తూ ఉండాలి. నిరంతరం పని చేయకుండా మధ్యలో విరామం ఇవ్వాలి. కాళ్లు నేలమీద ఆన్చి వెన్నెముక నిటారుగా ఉంచి కూర్చోవాలి. మీ దృష్టి మరీ అంత తీక్షణంగా ఉండకుడదు. మరింత కాంతివంతంగా కనిపించేలా మానిటర్ లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలి. మానిటర్ మీద యాంటిగ్లేర్ స్క్రీన్ ఏర్పాటు చేసుకుంటే మంచిది. మీరు ఎక్కువుగా కంప్యూటర్ ముందు పనిచేసేవారైతే మీ కళ్లు ఎక్కువుగా అలసటకు గురవుతాయి. ఆ సమయంలో ఈ 20-20-20 రూల్స్‌ని పాటించండి. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి మీరు బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటరుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్లు పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్, ఇది కల్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

బండినడిపేటప్పుడు : బండి నడిపేటప్పుడు సన్‌గ్లాసెస్‌ని వాడాలి. సూర్యుని నుంచి వచ్చే అతి నీలిలోమిత కిరణాలు యువి కిరణాలు తాకిడికిక కళ్లకు హాని కలగకుండా, దుమ్మి, దూళి పడకుండా కళ్లకు రక్షణగా ఉంటాయి. రాత్రులు బండి నడిపేటప్పుడు యాంటి గ్లేర్‌గ్లాస్లు వాడాలి. ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ల కాంతిని తగ్గించి కల్లకు రక్షణ కల్పిస్తాయి.

కొన్ని కంటి వ్యాయామాలు

- తలను బాగా విశ్రాంతిగా ఉంచి చూపును కుడి ఉంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి పూర్తిగా చివర్లకు తిప్పాలి. కనుగుడ్లు ఈ పక్క నుంచి ఆ పక్కకు, ఆ పక్క నుంచి ఈ పక్కకు తిప్పాలి.
- తలను విశ్రాంతిగా ఉంచి చూపును సవ్యదిశ లోను, అపసవ్య దిశలోనూ, తిప్పాలి, ఇలా 3 సార్లు చేయాలి.
- తలను ఏ మాత్రం కదల్చకుండానే వీలైన పైకి, మళ్లీ వీలైనంత కిందకి చూడాలి.
- తలను నిటారుగా ఉంచి చూపును పైకి తిప్పుతూ పూర్తి కుడివైపు నుంచి చూడండి, అలాగే చూపును కిందకి దించి పూర్తిగా ఎడమవైపు నుంచి చూడండి.
- మన కంటిలో 6 కండరాలు ఉంటాయి. ఇవి కన్ను గుడ్డును కదల్చడానికి సహాయపడుతాయి.

కన్నుగుడ్డు కదలడానికి కంటిలోని 6కండరాలు సహకరించాలంటే ఈ వ్యాయామాలు చేయాలి. కంటి సమస్యలను అశ్రద్ధ చేయకుండా వైద్యులను సరైన సమయంలో సంప్రదించి, కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఏదైన కళ్ల సమస్య ఉన్న వారు అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్న యష్ హాస్పిటల్‌ను, 0877 2238714 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.


కంటి వైద్యనిపుణులు డాక్టరు వి.రాజ్‌యశ్వంత్

రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టులపై, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ, తృణ ధాన్యాలను ప్రోత్సహించడం, స్వామిత్వా, రీసర్వే వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా హౌసింగ్ నిర్మాణ పురోగతి లక్ష్యాల మేరకు నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాల్సి ఉంటుందని ప్రత్యేక శ్రద్ధ వహించి నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి సిఎస్ వర్చువల్ విధానంలో రెవెన్యూ అంశాలైన రీ సర్వే, జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ, జగనన్నకు చెబుదాం, వ్యవసాయ శాఖ, మిల్లెట్ ప్రోత్సాహకం, జగనన్న పాల వెల్లువ, పశు సంవర్ధక శాఖ, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కింద ప్రాధాన్యతా భవనాల పురోగతి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో సమీక్ష నిర్వహించగా జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కార్యాలయం నుండి సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. మల్టీపర్పస్ ఫెసిలిటీ గోడౌన్‌ల నిర్మాణాలు ఫేజ్ 1 కింద మంజూరైన వాటిలో 20 పూర్తి అయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని, ఫేజ్-2 లో 28కి గాను తొట్టంబేడు, కేవిబీ పురంలో రెండు గోడౌన్‌లకు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని, ఫేజ్ 3 కింద కొత్తగా 39 గోడౌన్‌ల కొరకు స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. మిల్లెట్స్‌ని ప్రోత్సహించాలని సూచించారు. గృహ నిర్మాణశాఖ నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం సంబంధించి తిరుపతి జిల్లా లక్ష్యం మేరకు ఇళ్లు పూర్తి అయిన వాటిలో డ్రైనేజీ, తాగునీటి కనెక్షన్స్, విద్యుత్ కనెక్షన్, మ్యాజిక్ సోక్ పిట్‌ల ఏర్పాటు, తదితర మౌలిక సదుపాయాల కల్పన జరగాలని, జగనన్న కాలనీ వెల్కమ్ ఆర్చ్ ఏర్పాటు ఉండాలని సూచించారు. లేఅవుట్ వారీగా రోజువారీ స్టేజి కన్వర్షన్ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈసమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పథక సంచాలకులు డ్వామా శ్రీనివాసులు, జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర రావు, డిపీఓ రాజశేఖర్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోండి..

శ్రీకాళహస్తి గ్రామీణ పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ ధర్నా

ఎస్పీ హామీతో శాంతించిన తమ్ముళ్లు



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి గ్రామీణ సీఐ అజయ్ కుమార్ పై శాఖా పరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి డిమాండు చేశారు. శ్రీకాళహస్తి గ్రామీణ సీఐ అజయ్ కుమార్ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ టీడీపీ నాయకులు శనివారం గ్రామీణ పోలీస్ స్టేషన్ వద్ద సుమారు నాలుగు గంటల పాటు ధర్నా నిర్వహించారు. సీఐ అజయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా టీడీపీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించి నందుకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇటీవల 'సైకో పోవాలి' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేశారన్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరులో స్థానికులతో కలసి టీడీపీ శ్రేణులు నిరసన చేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కమ్మకొత్తూరుకు వెళ్లి నిరసన చేసిన వారిని చితకబాదారన్నారు. నిరసనతో సంబంధం లేకుండా కమ్మకొత్తూరుకు చెందిన చెంచయ్యనాయుడు అనే వృద్ధుడు చెత్త కాల్చుతుంటే అతనిని కూడా సీఐ చితక బాదడంతో పాటు బూట్ల కాళ్లతో తన్నారన్నారు. వృద్ధాప్యంలో ఉన్న చెంచయ్యనాయుడు లేవలేక కూర్చుని సీఐకు సమాధానం చెప్పినందుకు ఆయన మరింత రెచ్చిపోయి బూతులు తిట్టడంతో పాటు ఆ వృద్ధుని విపరీతంగా కొట్టారన్నారు. అంతేగాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తే అంతుచూస్తానని కమ్మకొత్తూరు గ్రామస్థులను సీఐ బెదిరించారన్నారు. కమ్మకొత్తూరు సంఘటన గురించి తాను సీఐను అడిగినందుకు తనను కూడా చెప్పలేని విధంగా పరుష పదజాలంతో దూషించారని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆరోపించారు. రాజకీయ పార్టీల నేతలు తనను ఏమీ చేయలేరని, పోలీస్‌స్టేషన్ వద్దనే తాను ఉంటానని వచ్చి ఏం పీకుతావో అని సీఐ సవాల్ విసరడంతో తాము ఇక్కడకు వచ్చామన్నారు. ఆయనకు ధైర్యం ఉంటే పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చి తాము ఏం పీకుతామో చూడాలన్నారు. సీఐ పోలీసు యూనిఫాం వేసుకుని వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నాడని వెంకట సుధీర్‌రెడ్డి ఆరోపించారు. సిఐపై చర్యలు తీసుకునే వరకు తాము ఇక్కడ నుంచి కదలమని భీష్మించుకున్నారు. టీడీపీ శ్రేణులు చేపట్టిన ధర్నా తీవ్రతరం కావడంతో శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు, సీఐలు మల్లిఖార్జున, విక్రమ్, అంజూ యాదవ్‌తో పాటు ఎస్‌ఐలు, పోలీసులు పెద్దసంఖ్యలో గ్రామీణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. వీరంతా బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డితో చర్చించారు. అయినా ఆయన ధర్నా విరమణకు అంగీకరించలేదు. తమకు తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. దీంతో పోలీసులు ఈ విషయం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి వెంటనే వెంకట సుధీర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. కమ్మకొత్తూరులో జరిగిన సంఘటనతో పాటు మరికొన్ని సంఘటనలపై విచారణ జరిపి సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో టీడీపీ శ్రేణులు ఆందోళన విరమించారు. ఈ ధర్నాలో టీడీపీ నేతలు రంగినేని చెంచయ్య నాయుడు, తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి, రావిళ్ల మునిరాజా నాయుడు, చక్రాల ఉష, కాసరం రమేష్, వజ్రం కిషోర్, సుబ్బయ్య, రేణుకమ్మ పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

పాక్షిక చంద్ర గ్రహణం

శ్రీవారి ఆలయం మూసివేత



ప్రజాశక్తి- తిరుమల: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం శ్రీవారి ఆలయంలో కైంకర్యాలు, ఏకాంత సేవ పూర్తి చేసుకొని రాత్రి 7.15 గంటలకు ఆలయ తలుపులు మూసివేయనట్లు ఆలయ ప్రధానోర్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. గ్రహణం అర్ధరాత్రి 1.05 నుంచి 2.22 గంటలకు నిర్దేశించినట్లు చెప్పారు. గ్రహణ సమయానికి ఏడు గంటల ముందు శ్రీవారి ఆలయం మూసివేయడం జరుగుతుందన్నారు. గ్రహణం పూర్తి అయ్యాక ఉదయం పుణ్యాహవచనం, శుద్ధి కార్యక్రమాలు పూర్తిచేసి సుప్రభాత సేవతో ఆలయంలో యథావిధిగా కైంకర్యాలు, భక్తుల దర్శనాలు మొదలవుతుందని తెలిపారు. పాక్షిక గ్రహణం కారణంగా శనివారం ఐదు గంటలకే తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని మూసివేయడం జరిగిందని తెలిపారు.

శ్రీవారి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి




తిరుచానూరులో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి- తిరుమల

ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి టీటీడీ జెఈవో వీరబ్రహ్మం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందించారు.

తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు టీటీడీ జెఈవో వీరబ్రహ్మం సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో డిఎల్‌వో వీరరాజు, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, లోకనాథం పాల్గొన్నారు.

పనిగంటలు రీషెడ్యూల్ చేయండి: సిఐటియు


నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్ల పనిగంటలను రీషెడ్యూల్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. యాజమాన్యం ఒత్తిళ్లు, పనిభారం వల్ల డ్రైవర్లు శారీరకంగా, మానసికంగానూ అలిసిపోతూ హఠాత్మరణాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న నిరంకుశ తీరుకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు శనివారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఆర్టీస్టీ డిపోలో సరైన పనివిధానం అమల్లో లేదన్నారు. డ్రైవర్ల కొరత కారణంగా పనిభారం ఎక్కువవుతుందని వాపోయారు. యాజమాన్యం ఒత్తిళ్లు, పనిభారం కారణంగా డ్రైవర్లు బీపీ, షుగర్ వ్యాధుల భారినపడుతూ గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ సమస్యలు వచ్చి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు ధనరాజ్, రాంబాబు మరణం ఇందుకు నిలువెత్తు సాక్ష్యాలని చెప్పారు. ఉదాహరణకు శ్రీకాళహస్తి- తిరుపతి మార్గంలో పాత పనిగంటలు, పాత కిలోమీటర్లనే లెక్కిస్తున్నారని, అధికారులు సర్వే చేసి రీషెడ్యూల్ చేయాలని సూచించారు. సాధారణ సెలవులే కాకుండా అత్యవసర సెలవులు సైతం మంజూరు చేసి డ్రైవర్లపై మానసిక ఒత్తిడి తగ్గించాలని కోరారు. పెండింగ్లో ఉన్న డీఏ బిల్లుల చెల్లింపుకు చొరవ చూపాలన్నారు. మరణించిన డ్రైవర్ల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో యాజమాన్యం తీరుమారకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో ఇటీవల మృతి చెందిన డ్రైవర్ రాంబాబు కుటుంబాన్ని పరామర్శించి ఆయన కుటుంబానికి అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, తదితరులు పాల్గొన్నారు.

యాత్రల జాతర

వీధుల్లో అధికార, ప్రతిపక్షాల హోరు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

అధికార వైఎస్‌ఆర్‌సిపి, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీలు ఎన్నికల జాతరకు తెరలేపాయి. పోటాపోటీగా యాత్రల పేరుతో వీధుల్లో హరెత్తిస్తున్నాయి. ఆధ్యాత్మిక నిలయమైన తిరుపతిని అందుకు వేదికగా చేసుకున్నాయి. ఇరుపక్షాలు హేమాహేమీలను పిలిపించి, సభలు, ర్యాలీలు నిర్వహించి, తాము గొప్పంటే తాము గొప్పంటూ ఉపన్యాసాలకు దిగడం గమనార్హం.

2024 అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అంతా సవ్యంగా సాగితే కాలపరిమితి పూర్తయ్యే వరకు వైసిపి అధికారంలోనే ఉంటే 2024 ఏప్రిల్, మే నెలలో ఎన్నికలు జరుగుతాయి. అధికారపార్టీ ముందస్తు ఎన్నికలకు వెళ్లితే, జనవరి, ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వైసిపి ప్రభుత్వం గడువు పూర్తయ్యే వరకు ఎన్నికలకు వెళ్లేలా లేదు. కానీ ఏది ఏమైన మరో ఆరేడు నెలలో ఎన్నికల పందెర ప్రారంభమవుతోంది. అంతకు ముందే ప్రజలను మెప్పించేందుకు, ఓటర్లను మభ్య పెట్టేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుని స్కిల్ కుంభకోణంలో సిఐడి అరెస్టు చేసి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించింది. సుమారు 45 రోజులకు పైగా చంద్రబాబు లాయర్లు అటు ఏసిబి కోర్టు, హైకోర్టు, ఇటు సుప్రీంకోర్టుల చుట్టు బెయిల్ కోసం తిరుగుతూనే ఉన్నారు. టిడిపి అధినేత అరెస్టు కావడంతో అధికారపార్టీ తిరుగులేదని భావించింది. కానీ అన్యుహంగా చంద్రబాబు కుటుంబ సభ్యులను రంగంలోకి దింపడంతో అధికారపక్షం ఖంగుతింది. చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తానే స్వయంగా బస్సు యాత్రకు తెరలేపింది. చంద్రబాబు అరెస్టు వల్ల చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించే పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు మరో యాత్రకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే నారాలోకేష్ చేస్తున్న యువగళం యాత్ర తాత్కాలికంగా బ్రేక్ పడడంతో భువనేశ్వరి యాత్ర ఇప్పుడు కార్యకర్తలకు, నాయకులకు నూనత ఉత్సాహాన్ని ఇస్తుందని భావించారు. అనుకున్నదే తడువుగా తిరుపతి కేంద్రంగా నిజం గెలవాలి పేరుతో భువనేశ్వరి యాత్రను ప్రారంభించారు. మొదటిగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని, తమ సొంతూరైన నారావారిపల్లికి చేరుకుని అక్కడ నుంచి ఈనెల 25 యాత్రను ప్రారంభించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఐతేపల్లి సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించి చంద్రబాబు ఏ తప్పు చేయలేదని, ఉద్దేశపూర్వంగానే అరెస్టు చేశారని విలపించారు. కోటేశ్వర్లయిన తాము కోటికి రెండు కోట్లకు కక్కుర్తి పడాల్సిన పనిలేదని, బాబు జీవితం అంతా ప్రజల కోసంమేనని వివరించారు. అక్కడ నుంచి ప్రారంభమైన ఆమె యాత్ర తిరుపతి, శ్రీకాళహస్తి మీదగా సాగింది. నారా భువనేశ్వరి యాత్రతో అధికార పార్టీల్లోనూ ఊపొచ్చింది. సామాజిక సాధికరాత పేరుతో 27వ తేదీ శుక్రవారం తిరుపతి నగరంలో బస్సుయాత్రకు తెరలేపారు. వైసిపి అనుబంధ సంఘాల సమన్వయకర్త విజయసాయిరెడ్డి రాకతో ఆయన సూచనల మేరకు బస్సు యాత్రను కాస్త పాదయాత్రగా మార్చారు. మదనపల్లి, చిత్తూరు వైపు నుంచి తిరుపతికి వచ్చే మార్గంలో ప్రధాన కూడలి అయిన జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి యాత్రను ప్రారంభించారు. వేలాది మంది కార్యకర్తలు, నాయకులతో తిరుపతిలోని 50 డివిజిన్ల మీదగా సుమారు 17 కిలోమీటర్ల పొడవు ఉదయం నుంచి రాత్రి వరకు యాత్రను నిరంతరాయంగా కొనసాగించారు. జగన్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యమని, అన్ని మతాలు, కులాలకు వైసిపి ప్రభుత్వంలోనే మంచి జరుగుతోందని చెబుతూనే 2024లో జరగబోవు ఎన్నికల్లో తిరుపతి వైసిపి ఎంఎల్‌ఏ అభ్యర్థిగా పోటీపడబోతున్న భూమన అభినయ్‌రెడ్డిని గెలిపించాలని ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, ప్రజలకు వేడుకున్నారు.


టిడిపి 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి


వైసిపి సామాజిక సాధికార యాత్రలో భూమన

గత మూడు రోజులుగా తిరుపతి జిల్లాలో సాగిన అధికార, ప్రతిపక్ష పార్టీల యాత్రులు కేవలం ఎన్నికల దృష్టిలో పెట్టుకునే జరిగాయని ప్రజలే బహిరంగంగా చర్చించుకున్నారు. మరోపక్క భూర్జవ రాజకీయ పార్టీలకు భిన్నంగా వామపక్ష పార్టీలు రాష్ట్రంలో, దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలు, అన్యాయాలు, మతం పేరట, కులం పేరుతో పెట్రేగుతున్న ఉన్మాదతత్వం, సనాతన ధర్మం పేరుతో మహిళలపై జరుగుతున్న దారుణాలను గొంతెత్తి వివరిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు పెట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పూనుకుంది. అనేక ప్రాంతాల్లో సమావేశాలు పెట్టి భూర్జవ ప్రభుత్వాలు సాగిస్తున్న దారుణాలను వివరిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువులను కాపాడాలని, దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ నినాదిస్తున్నారు. అందులో బాగంగా నవంబరు 15న ఛలో విజయవాడ పేరుతో ప్రజారక్షణ భేరికి నడుంబిగించారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ అనునిత్యం వారు పడే ఇబ్బందులను పసిగట్టి, ప్రతి సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు మేలు చేయాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు, నిరహార దీక్షలు, ర్యాలీలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై వాస్తవాలను వివరిస్తున్నారు. మహిళా సాధికారితకు, సమసమాజనిర్మాణానికి వారు చేస్తున్న పోరాటాలు ప్రజల్లో చర్చనీయాంశం చేస్తున్నాయి. ఎన్నికలతంతు కాదు ఎల్లప్పుడు ప్రజాసమస్యలపైనే పోరాటం అంటూ ముందుకెళ్ళుతున్నారు. ఇది భూర్జవ రాజకీయ పార్టీలు, వామపక్షాలకు ఉన్న తేడా అంటూ ప్రజలే ప్రశంసిస్తుండడం గమనార్హం.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి: ఆర్డీవో



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన ఓటర్ల జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేయడానికి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఓటర్ల తొలగింపులు, చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఒక పోలింగ్ బూత్‌లో రెండు శాతానికి మించి ఓట్లు తొలగించినా... అదేవిధంగా నాలుగు శాతానికి మించి ఓటర్లను చేర్చినా తానే స్వయంగా ఆ పోలింగ్ బూత్‌ను ప్రత్యేకంగా పరిశీలిస్తానని రవిశంకర్ రెడ్డి చెప్పారు. ఓటరు జాబితా నుంచి ఓటు తొలగించాలంటే తప్పకుండా మరణ ధృవీకరణ పత్రం సమర్పించాల్సిందే. ఓటు మార్పు చేయాల్సిన సంబంధిత ఓటరు నుంచి అంగీకార పత్రం తీసుకోవాల్సిందేనని ఆయన కోరారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. రాజకీయ పార్టీల నేతలు సహకరిస్తే ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేయవచ్చని ఆర్డీవో రవిశంకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇక అంతకు ముందు శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలో ఓటర్ల జాబితాకు సంబంధించి సూపర్ వైజర్లతో సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ రెడ్డి సూపర్ వైజర్లకు పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్ళు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇలాంటి వీరిని ఈ ఏడాది డిసెంబరు 9వ తేదీలోగా ఓటర్లుగా చేర్చాలన్నారు. ఇక వచ్చే ఏడాది అంటే 1 ఏప్రిల్ 2024, 1 జూలై 2024 లేదా 1 అక్టోబర్ 2024న ఏడైనా తదుపరి అర్హత తేదీలలో పద్దెనిమిది సంవత్సరాల వయస్సును చేరుకోబోయే అర్హత కలిగిన పౌరుడు ఓటర్ల జాబితాలో అతని లేదా ఆమె పేరును చేర్చడం కోసం అతని లేదా ఆమె క్లెయిమ్ ను ఫారమ్-6లో, నోటీసు తేదీ నుండి ముందుగానే దాఖలు చేయవచ్చన్నారు. ఈ నెల 28,29 తేదీ, నవంబరు 4,5వ తేదీ, డిసెంబరు 2,3వ తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ప్రకటించామన్నారు. ఆ రోజుల్లో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం కమిషనరు మున్సిపల్ రమేష్ బాబు, తహశీల్దార్లు ద్వారకానాథరెడ్డి, ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నేతలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

కృష్ణమనాయుడి కుంట ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి: కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో కృష్ణమనాయుడు కుంట ఆధునీకరణ పనులను పూర్తి చేసి నవంబర్ 15 లోపు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరంలో నిర్మాణంలో వున్న కృష్ణమనాయుడు కుంట పనులను, చెన్నారెడ్డి కాలనీ మీదుగా ఇస్కాన్ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న రహదారిని, జ్యూస్ లే అవుట్ వద్ద రోడ్ నిర్మాణ పనులను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ శనివారం పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీలో అతి పురాతన కృష్ణమ నాయుడు కుంట పూర్తి స్థాయిలో శిథిలావస్థలో వుండగా స్థానిక ప్రజలు గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారని ఎమ్మెల్యే సూచనలతో కౌన్సిల్ ఆమోదంతో పురాతన కట్టడాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో కృష్ణమ నాయుడు కుంటను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. అతి కొద్ది రోజుల్లోనే అన్ని పనులను పూర్తి చేసి ప్రారంభ విస్తామని తెలిపారు. చెన్నారెడ్డి కాలనీ మీదుగా ఇస్కాన్ రోడ్డును కలుపు తూ నిర్మిస్తున్న రహదారి పనులు పూర్తి అయితే ప్రజలకి కన్వెంట్ రహదారి అందుబాటులోకి వస్తుందని, రహదారికి ఇరు వైపులా ప్రహరి గోడలు నిర్మిస్తున్నామని, త్వరలో పూర్తి చేస్తామన్నారు. అనంతరం జ్యూస్ లే అవుట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ రోడ్డుకు తారు వేయడం ప్రారంభ స్తున్నామని, ఈ రోడ్డు పూర్తి అయితే చుట్టు పక్కల అన్ని ప్రాంతాల వారికి అనుకూ లంగా ఈ రహదారి అందుబాటులోకి వస్తుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాల సుబ్రమణ్యం, డిఈ శ్రావణి పాల్గొన్నారు.

చిల్లీస్ అంజిని సత్కరించిన ఎస్పీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమరవీరుల గొప్పతనాన్ని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తో పాటు ఈస్ట్ డీస్పీ , తిరుపతి రూరల్ డీస్పీ , తిరుపతి లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్, సబ్ ఇన్‌స్పెక్టర్స్ అమరవీరుల పోలీస్ వారి సేవలను వారి త్యాగాలను విద్యార్థిని విద్యార్థులకు జిల్లా ప్రజలకు గుర్తు చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు చిల్లీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అధినేత చిల్లీస్ అంజి హాజరయ్యారు. చిల్లీస్ అంజి పోలీస్ అమరవీరుల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి చిల్లీస్ అంజిని శాలువ పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇవో శేఖర్

విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ చూపాలి: డీఈవో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పిల్లల చదువుపట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపడంలేదని తగిన శ్రద్ధచూపాలని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. శనివారం గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమీక్షకు హాజరైన డీఈవో శేఖర్ మాట్లాడుతూ ఆరో తరగతిలో చేరిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. వారు బాగా చదవడం లేదని వదిలేస్తున్నారన్నారని, 'చదవలేరని మీరెలా నిర్ణయిస్తారు?' అంటూ ఆయన ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయులు తరగతి గదులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, సీఎంఓ సురేష్, ఎంఈవో సనత్ కుమార్ పాల్గొన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

డిప్యూటీ కమిషనర్‌కు సిఐటియు వినతి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తోపుడుబండ్ల వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరించాలని శనివారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద తోపుడుబండ్ల వ్యాపా రస్తులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, హాకర్స్ యూనియన్ నగర ప్రధానకార్యదర్శి బుజ్జి మాట్లాడుతూ నగరంలో తోపుడుబండ్ల మీద వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి పైన పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బంది చెప్పి వేధిస్తూ కేసులు పెట్టి కోర్టులో జరిమానాలు పెట్టే పద్ధతి మానుకోవాలని డిమాండ్ చేశారు. మరోపక్క మున్సిపల్ అధికారులు పాల్పడుతున్నారని, అధికారుల మాట వినకుంటే బండ్లు మొత్తం లాక్కెళ్లిపోవాలని బెదిరించడం దారుణమన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులందరికీ వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పై సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. 30వ తేదీ సోమవారం అధికారులతో చర్చించి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్షులు పి.మునిరాజ, టి.మురళి, చిన్న, ఎండి. శ్రీనివాసులు, యూనియన్ నగరాధ్యక్షులు ప్రసాద్, రామానుజులు, దాము, వాసు, మునిరత్నం, మణిమాల పాల్గొన్నారు.

రాస్ ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -రేణిగుంట: రాష్ట్రీయ సేవా సమితి పాడువు సంఘాల సంచాలకులు వి నాగరాజు ఆదేశానుసారం, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ద్వారా వెంకటాపురం గ్రామం రైతులకు సంబంధించిన అన్ని పశువులకు, జీవాలకు, రేణిగుంట ఏరియా వెటర్నరీ డాక్టర్ ప్రవంతి, రాస్ కె వి కె వెటర్నరీ డాక్టర్ అనూష లు ప్రధాన సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. ఈ శిబిరానికి ఆవులు, ఎనుములు, దూడలను తీసుకొచ్చిన అన్ని పశువులకు, దూడలకు, జీవాలకు సంబంధించి, మారుతున్న వాతావరణానికి సంబంధించి ఎటువంటి రోగాలు, సమస్యలు వస్తున్నాయి? వాటి నివారణోపాయాలు, నీటిని, మేతను ఎలా అందించాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో రాస్ కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ప్రాజెక్ట్ అధికారి వెంకటేష్, సిబ్బంది గిరి ప్రసాద్, అన్నలగన్, ఇందుమతి, శంకరయ్య, స్వాతి, నాగమణి, ట్రస్టీలు, క్లస్టర్ లీడర్లు , గోపాల మిత్రలు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు సక్రమంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పనితీరు ఆశించిన మేరకు లేదని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు అసహనం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని షాదీ మందిరంలో గూడూరు పట్టణ పరిధిలోని వార్డు సచివాలయాల సిబ్బంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది అంకిత భావంతో పనిచేసి పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో గూడూరు పట్టణ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత పేరుతో బస్సు యాత్ర విడ్డూరం

ఏపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వాలు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను ఎత్తివేసి వైసిపి మంత్రులు బడుగు బలహీన వర్గాల సాధికారత సాధించామని సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర చేయడం విడ్డూరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య ఆరోపించారు. అనేక సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేయకుండా సాధికారత సాధించామని బస్సుయాత్ర నిర్వహించడం ఎంతవరకు న్యాయమని పేర్కొన్నారు.

ఏపీ కార్డ్ ప్రైమ్ 2.0 రిజిస్ట్రేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి -కోట : ఏపీ కార్డ్ ప్రైమ్ 2.0 రిజిస్ట్రేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి నమోదు ప్రక్రియను ఆఫ్‌లైన్ మోడ్ నుండి కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా నూతనంగా ఆన్‌లైన్‌కి చేర్చిందని సబ్ రిజిస్ట్రార్ ప్రవీణా దేవి అన్నారు. ఈ సందర్భంగా శనివారం చిట్టమూరు మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులకు వీటిపై శిక్షణను నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రవీణ దేవి వారికీ పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉదయ్ కుమార్,ఫణి, సిబ్బంది పాల్గొన్నారు.

సాధనవారిపాలెం రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: మండలంలోని సాధన వారి పాలెం గ్రామానికి రోడ్డు సరిగ్గా లేక ప్రజలు ప్రయాణ కష్టాలను ఎదుర్కొంటున్న విషయాన్ని సిసిఎల్ పరిశ్రమతో పాటు ఎమ్మెల్యే ఆదిమూలం కు కూడా సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఎమ్మెల్యే సిసిఎల్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడడంతో వెంటనే స్పందించిన సిసిఎల్ పరిశ్రమ 15 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చి శనివారం భూమి పూజ చేపట్టారు. దీంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా గ్రామస్తులు హేమలత సిసిఎల్ పరిశ్రమకు, ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దయాకర్ రెడ్డి దామోదర్ రెడ్డి ,శివ పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ యార్డ్ తో సంబంధం లేదు: వైసిపి

ప్రజాశక్తి - పిచ్చాటూరు : ఇసుక డంపింగ్ యార్డ్ తో తమకు ఎలాంటి సంబంధం లేదని వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు వెల్లడించారు .అడవికోడియంబేడు పంచాయతీ లో ఇసుక అక్రమ డంపింగ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి భాస్కర్ నాయుడు మాట్లాడుతూ తేనాన్సీ ఎంటర్ప్రైస్ ప్రేవేట్ లిమిటెడ్ సంస్థ కు ఇసుక డంపింగ్ యార్డకు వ్యవసాయ భూమి లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. వ్యవసాయ భూమి ఇసుక డంప్ చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు అనవసర ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

పజాశక్తి -తిరుచానూరు: పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగం మరువలేనిదని ప్రాణాలు పనంగా పెట్టి సంఘ విద్రోహ శక్తుల నుంచి దేశాన్ని కాపాడిన వారి సేవలను గుర్తు చేసుకోవాలని ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని తిరుచానూరులో ఓ ప్రవేటు ఫంక్షన్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమానికి హాజరైన ఆయన రక్తదానం చేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ పోలీసులు, యువత, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని రక్త దానం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అమర వీరుల త్యాగం దేశ భద్రతకు దోహదపడితే వారి అంకిత భావానికి చేసిన రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న వారికి ఉపయోగ పడేలా తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. మీడియా మాధ్యమాల ద్వారా వారోత్సవాలో ఏర్పాటు చేసిన రక్తదానం గురిం చి తెలుసుకున్న ప్రజలు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ రాజగోపాల్ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఎస్సై బ్రహ్మ నాయుడుతో పాటు పలువురు పోలీసులు కూడా రక్తదానం చేసి అందరికి స్పూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సీఐ మధుబాబు, తడ ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): ప్రాణాపాయ పరిస్థితులలో రక్తాన్ని అందించి మరొకరికి జీవితాన్ని ప్రసాదించడం చాలా గొప్ప కార్యమని తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి నాధముని రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అన్నమాచార్య విద్యార్థులు 60 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్తలు, విభాగాధిపతులు, ప్రిన్సిపాల్ పీఏ బాలకృష్ణ పాల్గొన్నారు.



తిరుచానూరులో రక్తదానం చేస్తున్న పోలీసులు

తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాల శ్రీవారి సారె ట్రయిల్ రన్ విజయవంతం



శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహిస్తున్న టిటిడి అధికారులు

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మ వారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 10వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టమైన పంచమి తీర్థానికి చాలా ప్రాముఖ్యత ఉంది. పంచమి తీర్థానికి శ్రీవారి నుండి శ్రీ పద్మావతి అమ్మవారికి పసుపు కుంకుమ సారే ఊరేగింపుగా రావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం పసుపు కుంకుమసారే ఊరేగింపు ట్రయల్ రన్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజిఓ నంద కిషోర్, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, ఏఈఓ రమేష్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, తిరుచానూరు ఎస్ఐ వెంకట సుబ్బయ్య, విజిలెన్స్ బృందం, టీటీడీ ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ సమావేశమా.. పార్టీ సమావేశమా?

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: మండలంలోని సమస్యల పరిష్కారానికై ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ఒక వేదికగా ఏర్పడి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ఏర్పాటు చేసే సర్వసభ సమావేశం మండలంలో కొంతమంది అధికారుల తీరువల్ల అపహాస్యం పాలవుతోంది. ముఖ్యంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్యం రాజు తీరుపట్ల కొంతమంది ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వకుండా సమావేశాన్ని ఏర్పాటు చేయటంపై తీవ్రంగా ఖండిస్తున్నారు. శనివారం రోజు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొంతమంది సర్పంచులు తమ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పలు సమస్యలు అపరిష్కృతంగా మిగిలాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మప్రియ, సింగిల్ విండో చైర్మన్ హరిబాబు రెడ్డి, దామోదర్ రెడ్డి ,మండల సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

పాక్షిక చంద్రగ్రహణం

అమ్మవారి ఆలయం మూసివేత

ప్రజాశక్తి -తిరుచానూరు: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం పద్మావతీ అమ్మవారి ఆలయంలో కైంకర్యాలు, ఏకాంత సేవ పూర్తి చేసుకొని సాయంత్రం 5.15 గంటలకు ఆలయ తలుపులు మూసివేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు బాబు స్వామి తెలిపారు. గ్రహణం అర్ధరాత్రి 1:05 నిమిషాల నుంచి 2:22 గంటలకు ఉంటుందని, గ్రహణ సమయానికి తొమ్మిది గంటల ముందు అమ్మవారి ఆలయం మూసినట్లు తెలిపారు. గ్రహణ పూర్తి అయ్యాక ఆదివారం ఉదయం పుణ్యాహవచనం, శుద్ధి కార్యక్రమాలు పూర్తి అయ్యాక సుప్రభాత సేవతో ఆలయంలో యధావిధిగా కైంకర్యాలు, భక్తుల దర్శనాలు మొదలవుతుందన్నారు. పాక్షిక గ్రహణం కారణంగా ఇవాళ ఐదు గంటలకే అన్నదాన సత్రాన్ని మూసివేసినట్లు తెలిపారు.

చెంగారెడ్డిపల్లిలో అక్రమ కట్టడాలు ఆపాలి

- గిరిజనులు 80 మందికి జగనన్న ఇంటి పట్టాలు ఇవ్వాలి
- సిపిఎం నాయకుల ధర్నా

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీకి చెందిన చెంగారెడ్డిపల్లిలో గిరిజన సేవ సంఘం భవనం కు కేటాయించిన సర్వే నెం.538/1బి2సి లో 0.1సెంటు రెవెన్యూ రికార్డులో ఉన్నప్పుడు మిగతా 2 ఎకరాలు కబ్జా చేసింది ఎవరో కలెక్టర్ తేల్చాలని డిమాండ్ చేశారు. చెంగారెడ్డిపల్లిలో అక్రమ కట్టడాలు ఆపాలని, గిరిజనులు 80 మందికి 'జగనన్న ఇంటి పట్టాలు' వెంటనే ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి కె హరినాథ్ డిమాండ్ చేశారు. చెంగారెడ్డి పల్లిలో శనివారం నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. శిబిరం వద్ద కూర్చొని గిరిజనులకు అండగా పోరాటం నడుపుతామని, సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ చెంగారెడ్డిపల్లి ఎస్టీలకు కేటాయించిన సర్వే నెం.538/1, 538/2 లో 17 ఎకరాలు ప్రభుత్వ అనాధీనం భూమి కబ్జా చేసి గత రెండు నెలలుగా నిర్మిస్తున్న రేకుల ఇళ్లకు పంచాయతీ అనుమతులు, కరెంట్ మీటర్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 2017- 18 సంవత్సరం గత రిటైరు తహశీల్దారు నరసింహులు నాయుడు సంతకాలు చేసి ఇంటి పట్టాలు ఇచ్చారని తిరుపతికి చెందిన కబ్జాదారులు ఇంటి పట్టాలు కొనుగోలు దారు పేరుతో ఇప్పిస్తా మని గిరిజన భూమిని ప్లాట్లు వేసి అమ్ముతున్నారని నకిలీ ఇంటి పట్టాలు ఇచ్చి కరెంటు ఫోల్స్, ఇంటి మీటర్లు, గ్రామ పంచాయతీ అధికారుల నుండి ఎన్ఓసి సర్టిఫికెట్ అధికారుల నుండి కొనుగోలు దారులకు ఇప్పిస్తూ ఒక్క ఫ్లాట్ 7 లక్షల రూపాయలకు అమ్మేస్తుంటే రేణిగుంట మండల రెవెన్యూ, విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు ఏమైనా నిద్రపోతున్నారా? అని సిపిఎం మండల కార్యదర్శి కె. హరినాథ్ విమర్శిం చారు. చెంగారెడ్డిపల్లి గిరిజన భూములో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను స్థానిక గిరిజనులు నిరసన దీక్షలు చేస్తుంటే ఇంతవరకు రేణిగుంట మండల తహశీల్దారు ఎందుకు స్పందించడం లేదని, అక్రమ కట్టడాలు కడుతున్న వారి పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే గిరిజన సమస్యను పరిష్కరించకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగుతామని తెలిపారు. గిరిజన సేవ సంఘం అధ్యక్షులు విజయబాబు, గిరిజన సంఘం కార్యదర్శి సంపూర్ణ మాట్లాడు తూ 'మా గ్రామానికి కలెక్టర్ రావాలి.. గిరిజన భూమిని కబ్జాదారుల నుండి కాపాడి ఎస్టీ ఎరుకు ల కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన మహిళలు పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరసన



గూడూరులో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని మున్సిపల్ పారి శుధ్య కార్మికులు హెచ్చ రించారు. గూడూరు మున్సిపల్ పారిశుధ్య కార్మి కులు సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రదర్శన గూడూరు మున్సిపల్ కార్యాలయం నుండి టవర్ క్లాక్ సెంటర్ కి చేరుకొని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి పక్ష నేతగా వున్నప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ఆందోళనలో భాగంగా ఈ నెల 28వ తేదీ ప్రదర్శనలు , నవంబర్ 19,20 తేదీల్లో కలెక్టరేట్ కార్యా లయం ఎదుట వంట, వార్పు, డిసెంబర్ 9,10 తేదీల్లో నిరాహార దీక్షలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బి గోపీనాథ్, గూడూరు పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య కార్యదర్శి యస్.సురేష్, మున్సిపల్ జిల్లా కమిటీ సభ్యులు పెంచల ప్రసాద్ (పి.పి) మురళి రాఘవయ్య, పట్టణ అధ్యక్షులు పెంచల ప్రసాద్, కార్యదర్శి దారా కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు మణి, శాంతి వర్ధన్ ఆనందు, శీను, పోలిపాటి పెంచలయ్య, మహేష్, శ్రామిక మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు బట్టా ప్రభావతి, సంపూర్ణమ్మ, కమిటీ సభ్యులు పద్మమ్మ, సుబ్బమ్మ, పెంచలమ్మ పోలమ్మ, శ్రీ లక్ష్మీ, వరలక్ష్మి, నారాయణమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేటలోని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ శ్రీనివాస్ రావు కి మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో శనివా రం వినతిపత్రం సమ ర్పించా రు. కమిషనర్ సమస్య లపై సానుకూలంగా స్పందిం చా రని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలో రాకముందు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని కోరారు. కార్మికులపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఆప్కాస్ లోకి నమోదు కాని కార్మికులను తక్షణం నమోదు చేయాలని ఆయన కోరారు కార్మికుల సమస్యలు పరిష్కారం కాని సమక్షంలో రాష్ట్ర వ్యాపితంగా సమ్మె చేయడానికి వెనకాడబో మని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నెలవల హరి , చెంగయ్య ఆరావళి మస్తానయ్య, కర్ర లచ్చుమ్మ, మస్తానయ్య పాల్గొన్నారు.



నాయుడుపేటలో

వెంకటగిరి: శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లా యిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వ ర్యం లో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆప్కాస్ ఉద్యోగు లందరికీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం నుండి ఎంపీడీవో కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద సభ జరిగింది. కార్మికుల్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమా న వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరిం చకుంటే లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేసేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కార్యదర్శి ఎస్ ప్రసాద్, అధ్యక్షులు టి సుబ్బయ్య మహిళా కార్మికులు 50 మంది మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నాళ్లూరుపేట: సూళ్లూరు పేటలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. గతంలో ప్రతి పక్షంలో నేడు అధికార పక్షంలో వున్న నేటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. స్పందించకుంటే పెద్ద ఎత్తున సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియ్ (సిఐటియు) నాయకులు హెచ్ సుధాకరరావు, డి రమణయ్య, కె లక్ష్మయ్య, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు అమృతరామయ్య, వెంకటరత్నం, చంగయ్య, చిన్నయ్య, దేవి పాల్గొన్నారు.



సూళ్లూరుపేటలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ వర్కర్స్

నగరి లో ధనంతో కాదు.. జన బలంతో గెలుస్తాం :టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: టీడీపీ ప్రజల పార్టీగా జన బలంతో వచ్చే ఎన్నికల్లో నగరిలో గెలుస్తామని, గత నాలుగన్నరేళ్లుగా జగన్ పాలనలో నగరి లో హింస, అరాచకం చూస్తున్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలన్నది ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని తెలిపారు. కేంద్ర టిడిపి కార్యాలయంలో రాష్ట్ర టిడిపి అధ్యక్షులు అచ్చం నాయుడు తో చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి కలిసి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గాలి ముద్దుకృష్ణమనాయుడుకి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసిన నాయకుడు గాలి ముద్దుకృష్ణమనాయుడు అని, అలాంటి మహా నాయకుడు రాజకీయ వారసుడు గాలి భాను ప్రకాష్‌పై దాడి చేయడం నగరి ప్రజలు జీర్ణించుకోలేకపోయారని అందుకే దాడి జరిగిన గంటలోనే వేలమంది రోడ్డు పైకి వచ్చి తమ నిరసనను తెలిపారన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు చేసిన తర్వాత నగరిలో గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో అక్రమ అరెస్టును ఖండిస్తూ వివిధ మార్గాలలో నగరి ప్రజలను చైతన్య పరుస్తున్నారని తెలిపారు.



అంతర్జాతీయ పోటీలకు మంగళం విద్యార్థులు

జంప్ రోప్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ విద్యార్థులు ఈనెల 15 నుండి 17 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, కాంస్య పతకాలను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు నాయుడు, పీడీ రామకృష్ణ సాంబశివరావు తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు రమ్యశ్రీ బంగారు పతకం, జాహ్నవి కాంస్య పథకాలను సాధించి మంగళం ట్రెండ్స్ పాఠశాల ఖ్యాతిని పెంచారని అభినందించారు. ఈ ఇద్దరు విద్యార్థినులు డిసెంబర్ లో థాయిలాండ్ దేశంలో నిర్వహించే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించి అంతర్జాతీయ పోటీలలో విజయం సాధించి పేరు ప్రతిష్టలను పెంపొందించాలని సూచించారు.

డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మొదటి, మూడవ సంవత్సరం పరీక్ష ఫీజు గడువు నవంబర్ 10 తేదీలోపు చెల్లించాలని పరీక్షలు నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూ పరిధిలోని సిబిసిఎస్ విధానంలో 2023-24 అకాడమిక్ సంబంధించి డిగ్రీ మొదటి, మూడవ సెమిస్టర్ యూజీ కోర్సులు బిఏ, బిఏ ఓకల్, బీకాం, బీఎస్సీ, బిఎస్సి హోమ్ సైన్స్, బి-ఓకేషనల్, బిహెచ్ఎం, బిసిఏ, బి- మ్యూజిక్, బి-డాన్స్, మొదలగు కోర్సులకు డిసెంబర్ మొదటి వారం నుంచి పరీక్షలు ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులు ఆన్లైన్ అప్లికేషన్ 29వ తేదీ అక్టోబర్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా నవంబర్ 10వ తేదీ వరకు చెల్లించవచ్చుని, నవంబర్ 11 నుంచి 14 వరకు 500 రూపాయలు అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్దనున్న ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సులో వాల్మీకి జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి టాస్క్ ఫోర్సు ఎస్పీ కె.చక్రవర్తి నివాళులర్పించారు. ఎస్పితో పాటు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు, సీఐ శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ మోహన్ నాయక్ పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎల్ నినో, లా నినాల ప్రభావంతోనే వాతావరణంలో మార్పులు

ఎస్వీయూ భౌతిక శాస్త్ర ఆచార్యులు ఎస్ విజయభాస్కరరావు

ప్రజాశక్తి - క్యాంపస్: తూర్పు పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలలో మార్పులు ఏర్పడే ఎల్ నినో/లా నినా ప్రక్రియల మూలంగా ప్రపంచ వాతావరణంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని, దీని కారణంగా ఆంధ్రప్రదేశ్ సహా భారత ఉపఖండంలో వాతావరణం కూడా వాతావరణం మార్పులకు ఎంతో అవకాశం ఉందని ప్రముఖ భౌతికశాస్త్ర ఆచార్యులు ఎస్ విజయభాస్కర రావు పేర్కొన్నారు. వాతావరణం మార్పులు - కారణాలు అనే అంశంపై 'ప్రజాశక్తి 'తో ఆయన మాట్లాడుతూ ఎల్ నినో/లా నినా సదరన్ ఆసిలేషన్ ప్రక్రియ, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నమూనాలను ప్రభావితం చేస్తుందన్నారు. సహజ సిద్ధంగా జరిగే ఈ ప్రక్రియలో పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలలో మార్పులు జరగడం ద్వారా ఏర్పడే వాతావరణ పీడనం, ప్రసరణ మార్పులు, ప్రపంచ వాతావరణాన్ని ప్రభావితం చేస్తుందని వివరించారు. ఎంసో ప్రక్రియని అర్థం చేసుకోవడంలో, అంచనా వేయడంలో ఇటీవల కాలం శాస్త్రవేత్తలు పురోగతి సాధించారని తెలిపారు. ఎంసో ప్రక్రియ అర్థం చేసుకోవటం ద్వారా భారీ వర్షాలు, వరదలు, కరువు, కాటకాలు వంటి సంఘటనలను ఒకటి నుంచి తొమ్మిది నెలలు ముందుగానే గ్రహించి, వాటి పరిణామాల గురించి ముందుగానే హెచ్చరించే అవకాశం ఉందని వివరించారు.

2020 నుంచి 2023 వరకు సంభవించిన 'ట్రిపుల్-డిప్ లా నినా' సంఘటనలను పరిగణలోకి తీసుకొని ఈ లా నినా పసిఫిక్ మహా సముద్రంలో నిరంతరం బలమైన గాలులను కలిగి ఉండడాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత, గాలి క్రమ రాహిత్యాల నిర్దిష్ట నమూనాల కారణంగా ఇటువంటి పరిణామాలు జరిగినట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారని వెల్లడించారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత, గాలుల తీవ్రత ఆధారంగా ఈఅసాధారణ నమూనాలను ట్రిపుల్-డిప్ లానినా ప్రక్రియకు అనుకూలమైన వాతావరణాన్ని సష్టించాయని వివరించారు. 'నినో 3.4 ఇండెక్స్' పరి జ్ఞానంతో పసిఫిక్ మహాసముద్రంలోని నిర్దిష్ట భాగంలో ఉష్ణోగ్రతను కొలవడం సులభంగా మారిందన్నారు.

సెప్టెంబర్‌లో అరేబియా సముద్రం, పశ్చిమ భూమధ్యరేఖ హిందూ మహాసముద్రంలో వెచ్చని ఉపరితల ఉష్ణోగ్రతలు వున్నాకానీ, ఉత్తర బంగాళాఖాతం, దక్షిణ భూమధ్యరేఖ హిందూ మహాసముద్రంలో చల్లటి ఉష్ణోగ్రతలు వున్నాన్నారు. అక్టోబర్‌లో ఉత్తర అరేబియా సముద్రం వేడెక్కిందని, ఉత్తర బంగాళాఖాతం, భూమధ్యరేఖ భారతదేశంలో చాలా వరకు వేడెక్కిందని, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత చల్లబడిందన్నారు. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలో వచ్చే మూడునెలల పాటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ అంచనా వ్యవస్థ సూచిస్తుందని వెల్లడించారు. ఇది ఎల్ నినో పరి స్థితులు 2024 ప్రారంభంలో కొనసాగడానికి దారి తీయవచ్చు న్నారు. సానుకూల హిందూ మహా సముద్ర ద్విధ్రువ ఉపరితల ఉష్ణోగ్రత పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇది వెచ్చని ఎల్ నినో సానుకూల ఐఒడి పరిస్థితుల కారణంగా భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఎక్కువ వర్షాలు కురుస్తుందని, మరికొన్ని ప్రాంతాలలో కరువు కాటకాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో మరిన్ని తుపానులు వచ్చే అవకాశం ఉందన్నారు. సెప్టెంబరు నుంచి నవంబర్ 2023 వరకు తీవ్ర వాయువ్య, ఈశాన్య , దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సగటు కంటే ఎక్కువ వర్షం కురిసే సంభావ్యత ఎక్కువగా ఉంటుందని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వాలు తగ్గిన సహాయక చర్యలు చేపట్టేందుకు వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గమనిస్తూ వారి సూచనలు సలహాలు పాటించాలని సూచించారు.

